క్లుప్తంగా

21న ఎస్ఎఫ్ఐ మహాసభలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

మదనపల్లె సిటీ: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా తొలి మహా సభలు ఈ నెల 21, 22వ తేదీల్లో మదనపల్లెలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ నాయకుడు నరసింహ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి జిల్లా మహా సభల కర పత్రాలను గురువారం ఆవిష్కరించారు. నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పరిరక్షణకు పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్‌నాయుడు, నాయకులు గాలి రవీంద్ర, సురేంద్ర, చలపతి, నాగరాజ, వరప్రసాద్, రామచంద్ర, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది సమయపాలన పాటించాలి



బహుమతి అందజేస్తున్న వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: ఆర్టీసీ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణ తెలిపారు. స్థానిక డిపో కార్యాలయంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ మదనపల్లె-తంబళ్లపల్లె రూట్‌లోబస్సు డ్రైవర్లు సమయపాలన పాటించడంలేదని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ప్రయాణికులతో సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామన్నారు. అనంతరం ప్రతిభ చూపిన ఆర్టీసీ సిబ్బంది శివశంకర్ , వేణుగోపాల్, టి.వి.రమణ, కె.సుధాకర్, బి.కృష్ణ, సుధాకర్, లీలావతమ్మ, పీఆర్.బేగ్, కృష్ణప్పలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దారుపై ఫిర్యాదు

బి.కొత్తకోట: బి.కొత్తకోట ఎఫ్ఏసీ తహసీల్దారు మహమ్మద్ అన్సారీపై మండల వీఆర్వోలు మదనపల్లె సబ్ కలెక్టర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. తుమ్మనంగుట్ట వీఆర్వో జయరాంరెడ్డి, తహసీల్దారు మధ్య వాగ్వాదం జరగడంతో కలెక్టర్‌కు సరెండర్ చేస్తారని తహసీల్దారు చెప్పడం దారుణం అన్నారు. సబ్ కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే పరామర్శ

రామసముద్రం: మండలంలోని బల్లవారిపల్లికి చెందిన టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి భార్య పార్వతమ్మ (65) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మృతురాలి కుటుంబీకులను పరామర్శించారు. టౌన్ బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, నాయకులు మహేశ్వర్ రెడ్డి, కృష్ణంరాజు, నారాయణరెడ్డి, కిట్టు, రాజేష్, భువనేశ్వర్ రెడ్డి, బాబు, రామిరెడ్డి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.


భూ సమస్యలకు పరిష్కారం

కలకడ: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దారు ఫణికుమార్ అన్నారు. ఈ నెల 6న కదిరాయచెర్వు, 7న ఎనుగొండపాళ్యెం, 10న ముడియంవారిపల్లె, 12న నవాబుపేట, 13న ఎర్రకోటపల్లె, 17న గంగాపురం, 19న దొడ్డిపల్లె, 20న కలకడ-3, 23న కలకడ-2, 24న కలకడ-1, 26న గుడిబండ, 27న కోన, 31న నడిమిచెర్ల, 2025 జనవరి, 2న మాదినేనిపాల్యెం, 3న దేవులపల్లె, 4న రాతిగుంటపల్లె సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద సమావేశాలు నిర్వహిస్తామన్నారు.

కలికిరి మండలంలో..

కలికిరి: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు మహేశ్వరిబాయి తెలిపారు. ఈ నెల 6న కలికిరి రెడ్డివారిపల్లి, 10న మర్రికుంటపల్లి, 12న మహల్, 13న గుండ్లూరు, 17న చీకటిపల్లి, 18న పారపట్ల, 20న మేడికుర్తి, 24న పల్లవోలు, 26న మునెళ్లపల్లి, 27న టి.సంగ్రావారిపల్లి, 31న పత్తేగడ, 2025 జనవరి, 02న కొర్లకుంట, 07న కలికిరి, 08న గుట్టపాళెం గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయని ఆయన తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



శివశంకర్ (ఫైల్)

కలకడ: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన గురువారం కలకడ ఆదర్శ పాఠశాల సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలం లోని బొజ్జగుంటపల్లెకు చెందిన చిన్నయ్యనాయుడు కుమారుడు శివశంకర్‌నాయుడు(51) ద్విచక్ర వాహనంలో కలకడకు వచ్చారు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో కలకడ ఆదర్శ పాఠశాల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలైన ఆయనను స్థానికులు 108కు సమాచారం అందించారు. వారు వచ్చిచూడగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నిధుల కోత... పన్నుల వాత

పనులకు నిధులివ్వాలని ప్రతిపాదనలు పంపినా స్పందన కరవైంది. దీంతో నగర పంచాయతీ ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు ప్రజలపై పన్నుల వాత పడుతోంది. పన్ను కట్టాలంటూ కమిషనర్ పల్లవి, అధికారులు కాలనీల బాట పడుతున్నారు. తమకు సహకరించి పన్ను కట్టాలని ఇళ్ల యజమానులను కోరుతున్నారు.

- రూ.2.75 కోట్ల బకాయిలు ఉన్నాయంటున్న కమిషనర్
- ఇంటింటా ఐదు ప్రత్యేక బృందాలతో పన్నుల వసూలు
- నిధుల్లేక నీరసించిన నగర పంచాయతీ



పన్నులు చెల్లించాలని షాపు నిర్వాహకులను కోరుతున్న కమిషనర్ పల్లవి

బి.కొత్తకోట: బి.కొత్తకోట నగర పంచాయతీలో పన్నులు సకాలంలో చెల్లించకపోవడంతో అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోంది. దీంతో ప్రజల వద్ద పన్ను వసూలు చేసేందుకు అధికారులు నడుం కట్టారు. బి.కొత్తకోట నగర పంచాయతీలో 7,181 గృహాలున్నాయి. వాణిజ్య సంబంధిత దుకాణాలు మరిన్ని ఉన్నాయి. వీటి ద్వారా రావాల్సిన పన్ను బకాయిలు రూ.3,33,94,356 వరకు నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి నుంచి బకాయిలు పేరుకు పోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి రూ.2 కోట్లకు పైగా పన్ను మాఫీ చేయించారు. అనంతరం ప్రజలు పూర్తిస్థాయిలో చెల్లించక పోవడంతో బకాయిలు పెరిగిపోయాయి. మార్చి 31వ తేదీ వరకు గడువు ఉండడంతో కొంత మేరకు పన్ను చెల్లించేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారు. చాలామంది పెద్దగా స్పందించడం లేదు. దీంతో నగర పంచాయతీకి నిధులు సమకూరక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

150 మందికి నోటీసులు

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వ స్థాయిలో చర్యలు చేపట్టాల్సి ఉంది. దీనిపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారో చెప్పలేని పరిస్థితి. దీంతో వసూళ్లపై దృష్టి పెట్టారు. నగర పంచాయతీ పరిధిలో అధిక పన్ను బకాయిలు కలిగిన 150 మందికి నోటీసులు జారీ చేశారు. తక్షణమే పన్ను బకాయిలు చెల్లించని పక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసుల సారాంశం. దీనికి తోడు కమిషనర్ పల్లవి వసూళ్లపై దృష్టి పెట్టి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఐదు సచివాలయాల పరిధిలో ఐదు బృందాలకు వసూళ్ల బాధ్యతలను అప్పగించి లక్ష్యాలను నిర్దేశించారు. వారిపై పర్యవేక్షణ బాధ్యతను మరో ఇద్దరు ఉద్యోగులకు అప్పగించారు. కమిషనర్ పల్లవి, మేనేజర్ రమాదేవి, సిబ్బంది పన్నుల వసూళ్లకు గురువారం నేరుగా ప్రజల వద్దకే వెళ్లారు. పన్ను చెల్లించాలని విన్నవించారు. వాణిజ్య దుకాణాలు, ఇళ్ల వద్దకు వెళ్లి పన్ను చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీంతో రూ.59 లక్షల వరకు వసూలయ్యాయి. ఇంకా రూ.2.75కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇందుకోసం అధికారులు కాలనీలకు వెళ్లి కుస్తీ పడుతున్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరిస్తే తమకు ఈ బాధలు తప్పుతాయని నగర పంచాయతీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- నగర పంచాయతీలోని గృహాలు: 7,181
- ఇప్పటి వరకు వసూలు: 58,87,125
- మొత్తం బకాయిలు: 2,75,07,231

- మొత్తం వసూలు కావాల్సిన బకాయిలు
- పాత బకాయిలు: రూ.2,01,45,724
- కొత్త బకాయిలు: రూ.1,32,48,632

- వసూలైన బకాయిల మొత్తం
- పాత బకాయిలు: రూ.15,59,398
- కొత్త బకాయిలు: రూ.43,27,727

- ఇప్పటి వరకు వసూలు కానివి
- పాత బకాయిలు: రూ.1,85,86,326
- కొత్త బకాయిలు: రూ.89,20,905

పకడ్బందీగా ఎంఎస్ఎంఈ సర్వే

– డీఎల్‌డీఓ అమరనాథ్‌రెడ్డి

మదనపల్లె: మండలంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) సర్వే పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌డీఓ అమరనాథ్‌రెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సెక్రటరీలు, సిబ్బందికి సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ సర్వే మొత్తం ఎనిమిది అంశాలపై చేయాల్సి ఉంటుందని, వ్యాపార యజమానులు అందించే వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. వ్యాపార యజమాని ఎవరు? ఎంత పెట్టుబడి పెట్టారు? వ్యాపారం ఎలా ఉంది? సిబ్బంది కొరత ఏమైనా ఉందా? కొత్త సాంకేతికత వినియోగిస్తున్నారా? సిబ్బందికి శిక్షణ అవసరమా? బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్నారా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? సరుకు ఎవరికి ఎగుమతి చేస్తారు? ట్రేడింగ్‌లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? తదితర అంశాలపై సర్వే చేయాలన్నారు. సర్వేలో పాల్గొని ప్రతి షాపు, ఫ్యాక్టరీ నుంచి వివరాలు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, శంకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి సదస్సులు

రామసముద్రం: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దారు నిర్మలాదేవి తెలిపారు. 6న రామసముద్రం, 10న చొక్కాండ్లపల్లి, 12న కుదురుచీమనపల్లి, 13న మినికి, 17న ఊలపాడు, 19న అరికెల, 21న మాలేనత్తం, 24న మూగవాడి, 26న ఎలవానెల్లూరు, 28న చెంబకూరు, 31న నారిగానిపల్లి, 2025 జనవరి, 2న కాప్పల్లి, 4న పెద్దకురప్పల్లి, 7న ఆర్.నడింపల్లి, 8న కురిజలలో సదస్సులు ఉంటాయన్నారు.

కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏదీ?

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వైఎస్సార్‌సీపీ నేతలతో చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె: ఎన్నికలకు ముందు ఇష్టానుసారం హామీలు గుప్పించి ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వానికి అవి నెరవేర్చాలనే చిత్తశుద్ధి లేదని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని మారేళ్లకు చెందిన మాజీ సర్పంచ్ కాశెట్టి వాసయ్యను గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్తు చార్జీలు పెంచి పేదల నడ్డి విరుస్తోందని, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. సీఎం చంద్రబాబు ప్రజలకు హామీలివ్వడం.. అనంతరం మాటతప్పడం మామూలే అన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై బురద జల్లేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, జయరామచంద్రయ్య, కోర్టు సుబ్బారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనాథరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటసిద్దులు, దినేష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, చామంచుల సిద్దయ్య, ఆంజినేయులు పాల్గొన్నారు.

శుభ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే

పీలేరు: పీలేరు పట్టణంలో జరిగిన వివిధ శుభ కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరయ్యారు. కోటపల్లెలో ఆర్.ఎస్.సురేంద్రరెడ్డి గృహ ప్రవేశం, నారెం మధుసూదన్‌రెడ్డి కుమార్తె ఎన్. లిఖిత రెడ్డి వివాహానికి హాజరయ్యారు. ఆయన వెంట సర్పంచ్ హబీబ్‌బాషా, విజయశేఖర్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, షాకీర్, మునీర్, అబీద్, పాల్గొన్నారు.

నేలలను సంరక్షించుకుంటే రైతుకు నాణ్యమైన దిగుబడులు



మాట్లాడుతున్న కేవీకే కో-ఆర్డినేటర్ డా.మంజుల



చొక్కాండ్లపల్లెలో మాట్లాడుతున్న ఏఓ మోహన్

కలికిరి: నేలల ఆరోగ్యంతో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే కో-ఆర్డినేటర్ డా.మంజుల అన్నారు. స్థానిక కేవీకే కార్యాలయంలో గురువారం ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యవసాయ ఆహార సంస్థ, ఐక్యరాజ్య సమితి నిర్ణయం మేరకు డిసెంబరు 5న ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించడం జరుగుతోందన్నారు. మట్టి సమస్త ప్రాణులకు ఆధారమని, రసాయనిక ఎరువులతో కలుషితం కాకుండా చూడాలన్నారు. అనంతరం భూసార పరీక్షల గుర్తింపు పత్రాలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నవీన్ కుమార్ రెడ్డి, డా.స్వరాజ్యలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్తలు డా.సోమశేఖర్, శ్రీనివాసులు, పీరూసాహెబ్, మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

రామసముద్రం: రైతులు భూసారాన్ని పెంచుకున్నట్లయితే మంచి దిగుబడులను సాధించుకోవచ్చునని ఏఓ మోహన్‌కుమార్ తెలిపారు. గురువారం చొక్కాండ్లపల్లెలో ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ...రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడి నేలను కాపాడుకోవాలన్నారు. సరైన యాజమాన్య పద్ధతులతో భూమిని రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పీలేరు రూరల్: భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు పొందవచ్చునని ఏడీఏ వైవి.రమణరావు అన్నారు. ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా మండలంలోని గూడరేవుపల్లె రైతు సేవా కేంద్రంలో గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్‌పంటలు, పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో నేలను రక్షించుకోవచ్చునన్నారు. అనంతరం మట్టి నమూనాలు సేకరించారు. ఏవో రమాదేవి, ఏఈవోలు ఇంద్ర, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కేవీపల్లె: నేలను రక్షించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి శ్రావణి అన్నారు. ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా మండలంలోని సొరకాయలపేటలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్ధతుల ద్వారా నేల, నీటిని సంరక్షించుకోవడం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి



రామసముద్రంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ: రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న టీచర్ ఇజాజ్ అహ్మద్ మరణానికి కారకులను కఠినంగా శిక్షించడంతోపాటు ఈ సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మదనపల్లె పట్టణంలోని జెడ్పీ, వివేకానంద మున్సిపల్ ఉన్నత, ఉర్దూ మున్సిపల్, సీటీఎం, బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నాయకులు మధుసూదన్, పురం రమణ మాట్లాడుతూ సంఘటనపై సమగ్ర విచారణ చేసి.. భవిష్యత్తు కార్యాచరణపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, నాగరాజు, సుధాకర్ నాయుడు, హేమలత, గాలి రవీంద్రపాల్గొన్నారు. అనంతరం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు.

రామసముద్రం: టీచర్‌పై దాడి కేసులో దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని రామసముద్రం జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి, రామసముద్రం అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ..రాయచోటిలో ఇజాజ్ అహ్మద్ మృతి సంఘటన బాధాకరమన్నారు. ఈ సంఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. పిల్లల తల్లిదండ్రులను పట్టించుకోకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రమాదేవి, సురేష్, గాయత్రి, నరేంద్ర, షాహిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: రాయచోటి కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాల టీచర్ ఇజాజ్ అహ్మద్ మృతి ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని ఫ్యాప్టో ఉపాధ్యాయులు కోరారు. గురువారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద ఫ్యాప్టో ఉపాధ్యాయులందరూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. సమగ్రంగా దర్యాప్తు చేసి బాధితుడి కుటుంబానికి న్యాయం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

ఉపాధ్యాయులకు రక్షణ కల్పించండి

కలకడ: విద్యాబుద్ధులు నేర్పి చిన్నారులకు బంగారు భవిష్యత్తునిచ్చే ఉపాధ్యాయులపై దాడి చేయడం హేయమైన చర్య అని ఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీనివాసరావు, శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యం, డిమాండ్ చేశారు. ఎంఈవో రామచంద్రారెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కొత్తపల్లె ఉర్దూ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఇజాజ్ అహమ్మద్‌పై విద్యార్థులు దాడి చేసి చంపడం దారుణమన్నారు. పాఠశాల ఆవరణలో గుట్కా, గంజాయి సంస్కృతిని ప్రారద్రోలాలని, అవసరమైతే ఉపాధ్యాయుల రక్షణకు చట్టాలు సవరించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఉపాధ్యాయులపై దాడి సంఘటనలు పెరిగాయని గుర్తు చేశారు. ఇజాజ్ అహమ్మద్ మృతికి కారకులను శిక్షించి మృతుడి కుటుంబీకులను ఆదుకోవాలని కోరారు. అంతకు ముందు మృతుడి ఆత్మకు శాంతి కలగాలంటూ మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రమణ, సరస్వతిరెడ్డి, కవిత, చెంగలరాయుడు షబ్బీర్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

పీలేరురూరల్: కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల దాడిలో ఉపాధ్యాయుడు మృతి చెందడం దారుణమని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద గురువారం నిరసన ప్రదర్శించారు. తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్ మృతి కలచివేస్తోందని పేర్కొన్నారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. శివారెడ్డి, మహేశ్వరరెడ్డి, అక్రమ్‌బాషా, రహమత్‌బాషా, వేణుగోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, సుధాకర్, మస్తాన్, జయరాం తదితరులు పాల్గొన్నారు.



పీలేరు ఎమ్మార్సీ వద్ద ఉపాధ్యాయుల నిరసన



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



సబ్ కల్టెకర్‌కు వినతిప్రతం అందజేస్తున్న నాయకులు

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



పాలిటెక్నిక్ కళాశాల ఫెస్ట్‌లో ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కలికిరి: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, కలికిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎస్.శ్రీనివాసులు పేర్కొన్నారు. కలికిరి పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన రీజనల్ పాలిటెక్ ఫెస్ట్-2024ను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలకు చెందిన 14 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి వచ్చిన 298 మంది విద్యార్థులు తమ ప్రదర్శనలను ఏర్పాటుచేశారు. అధ్యాపకులు వాటిని పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. మండలంలోని 9, 10వ తరగతుల విద్యార్థులు హాజరై ప్రదర్శన తిలకించారు. శుక్రవారం కూడా ఫెస్ట్ కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శివరామక్రిష్ణ, సాంబశివరెడ్డి, డా. పి.రఘు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం..దేశ వికాసానికి సౌభాగ్యం



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రమేష్

పీలేరు: పిల్లల ఆరోగ్యం దేశ వికాసానికి సౌభాగ్యమని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని తలపుల ప్రాథమిక పాఠశాలలో గురువారం రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంత, చెవి, ముక్కు, గజ్జి, తామర, శ్వాసకోశ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు నోటి శుభ్రత, చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, ఏఎన్ఎం రెడ్డిబీ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలి

మదనపల్లె: మదనపల్లె తహసీల్దారు కార్యాలయంలో అవినీతిపై విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మదనపల్లె శాసన సభ్యులు ప్రతి నెలా రూ.30 లక్షలు ఇవ్వాలని తహసీల్దారుపై ఒత్తిడి తెస్తున్నట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు చెప్పకుండా కొన్ని మ్యుటేషన్లు చేసినందుకు ఆమెను విధులకు హాజరు కావద్దని, మాజీ ఎమ్మెల్సీకి చెందిన భూమి మ్యుటేషన్‌కు తహసీల్దారు డబ్బులు అడిగారని చర్చ జరుగుతోందన్నారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను కలిసి తహసీల్దారు విన్నవించినట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. అధికారులు స్వేచ్ఛగా పనిచేసుకునే వాతావరణం కల్పించాల్సిన అవసరం ఎమ్మెల్యేపై ఉందన్నారు. కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను బహిర్గతం చేయాలని కోరుతున్నామన్నారు.

నేటి నుంచి పల్లెల్లో రెవెన్యూ సదస్సులు

పెద్దమండ్యం: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సయ్యద్ అహ్మద్ తెలిపారు. 6న వెలిగల్లులో, 7న బండమీదపల్లె, 10న ముసలికుంట, 11న రామానాయక్‌తండా, 12న దిగువపల్లె, 13న బండ్రేవుల, 17న అవికేనాయక్‌తండా, 18న మండలవారిపల్లె, 19న పెద్దమండ్యం, 20న బిక్కావాండ్లపల్లె, 24న సి.గొల్లపల్లె, 26న కలిచెర్లలో, 27న ఎన్‌వోపల్లె, 28న కోటకాడపల్లె, 2025 జనవరి, 2న పాపేపల్లె, 3న గుడిసెవారిపల్లె, 7న శిద్దవరం, 8న శివపురం గ్రామాలలో సదస్సులు ఉంటాయన్నారు. రైతులు తమ సమస్యలు విన్నవించుకోవాలన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

ములకలచెరువు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటరమణ మాట్లాడుతూ... భవిత కేంద్రాలకు వచ్చే విద్యార్థులు ప్రభుత్వాలు అందిస్తున్న సదుపాయాలుసద్వినియోగం చేసుకోవాలని కోరారు. నీరజ, కుసుమ పాల్గొన్నారు.

కలికిరి: దివ్యాంగులకు ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తోందని ఎంఈఓ కరీముల్లా అన్నారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీపీ(మెయిన్)స్కూల్ ఆవరణలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రం ద్వారా దివ్యాంగుల మానసిక, శారీర ఆరోగ్యానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం దివ్యాంగ విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. హెచ్ఎం మురాషావల్లి, దనలక్ష్మీ పాల్గొన్నారు.

నిమ్మనపల్లె: దివ్యాంగుల ప్రతిభ గుర్తించి, వారి ఉన్నత భవిష్యత్తుకు చేయూతనందించాలని మండల విద్యాశాఖ అధికారి నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో గురువారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లల పట్ల ఉపాధ్యాయులు మానవతా దక్పథంతో వ్యవహరించాలన్నారు. పిల్లలకు బహుమతులను అందజేశారు. సురేష్, ప్రదీప, సుజాత, న్యామత్‌బీ పాల్గొన్నారు.

రామసముద్రం: మండలంలోని భవిత కేంద్రంలో గురువారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు హేమలత, ఆంజనేయులు, హెచ్‌ఎం కె.హేమలత మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లయితే వారికి అన్ని సౌకర్యాలతో పాటు, కళాశాలకు వెళ్లేవారికి ఉచితంగా విద్యాసామగ్రి అందిస్తామన్నారు. కార్యక్రమంలో పిల్లలకు బహుమతులు అందజేశారు.

కలకడ : దివ్యాంగులకు ప్రత్యేక గుర్తింపుతో ప్రభుత్వం ఉపాధి చూపిస్తోందని ఎంఈవోలు మునీంద్రనాయక్, రామచంద్రారెడ్డిఅన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కలకడ భవిత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆర్‌పిడి-2016 చట్టంలో వికలాంగులకు రిజర్వేషన్లు, వారికి ఉచితంగా అందించే వినికిడి యంత్రాలు, ట్రై సైకిల్స్, ట్యాబ్స్ వంటి ప్రయోజనాలు ఉన్నాయన్నారు. చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: స్థానిక భవిత కేంద్రంలో ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్‌ల అధ్యక్షతన దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ సమాజంలో ఎంతో మందికి వికలత్వం ఉన్నా వాటిని లెక్క చేయకుండా సంకల్ప బలంతో అసాధ్యాన్ని సుసాధ్యం చేయడమే గాక ఉన్నత శిఖరాలు కూడా అధిరోహించారని తెలిపారు.హెచ్‌ఎం శంకర్, ప్రభాకర్, ఆయేషా పాల్గొన్నారు.

పీలేరు: ప్రత్యేక అవసరాల విద్యార్థులు సమసమాజ నిర్మాతలని ఎంపీడీవో శివశంకర్, ఎంఈవో పద్మావతి అన్నారు. గురువారం స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సురేంద్రనాథ్‌రెడ్డి, భలలితకుమారి, ధరణిజ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బి.కొత్తకోట: దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రెడ్డిశేఖర్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని దివ్యాంగులు, వారి తల్లులతో సమావేశం నిర్వహించారు. వీరికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, పథకాలు, విద్య, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎంలు భువనేశ్వరీ, భాస్కర్, భవిత సిబ్బంది పాల్గొన్నారు.

కేవీపల్లె : స్థానిక భవిత కేంద్రంలో గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈవోలు రెడ్డిబాషు, సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల గల పిల్లలను సాధారణ పిల్లల వలే చూసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు వైవి. రమణ, నాగరాజు, మాధవి తదితరులు పాల్గొన్నారు.